# కొసమెరుపు కథ - భలేస్టంటు

జి.వి.జి




నాకు సినిమాలు చూసే అలవాటు అట్టే లేదు గాని, ఏం తోచనప్పుడు నా బాల్య మిత్రుడు ధర్మరాజు మేనేజర్‌గా ఉండే 'కీర్తన' థియేటర్ వైపు అతనితో పిచ్చాపాటీ మాట్లాడుకునేందుకు తరచు వెళ్తుంటాను.

ఓరోజు థియేటర్ వద్ద జనం అట్టే లేరు. నేను ధర్మరాజు గదిలో ఉండగా బయట నుంచి కేకలు వినిపించాయి.

"మన సిన్మాలలో అశ్లీలం... నశించాలి."

"ద్వంద్వార్థ సంభాషణలను..... సమాధి చేయాలి."

"నటీమణుల అంగాంగ ప్రదర్శనలు.... నిర్మూలించాలి."

"సిన్మాలలో హింస.... సమసిపోవాలి."

"చెత్త సిన్మాలను.... బహిష్కరించాలి."

తెల్ల చీరలు ధరించిన నలుగురు మహిళలు పై వాక్యాలు రాసిన అట్టలు చేతపట్టుకుని నినాదాలు చేస్తూ, ఆ థియేటర్ దగ్గరికే వస్తున్నారు. వాళ్ళ వంక రోడ్డు మీద ప్రోగయిన జనం వింతగా చూస్తున్నారు.

ధర్మరాజు ఎకాయెకీన ఆ మహిళల దగ్గరికెళ్లి, "అమాంతంగా మా థియేటర్ మీద పడ్డారేమిటి? ఇప్పుడు ప్రదర్శిస్తున్న 'కేరళనారి' సినిమా సెన్సార్ చేయబడింది తెలుసా?" అన్నాడు.

వాళ్ళల్లో కాస్త నల్లగా ఉన్న స్థూలకాయురాలు ముందుకొచ్చి, "తెలుసులేవయ్యా. సెన్సార్ వాళ్ల తొలగించిన భాగాలన్నీ చేర్చి ప్రదర్శించే విషయం మా నారీమణుల సంఘానికి తెలియదనుకున్నావా?" అంది.

ధర్మరాజు చేతులు జోడించి, "అమ్మా, ఆ డబ్బింగ్ సినిమాను నేను హైర్‌కు తీసుకున్నాను. అర్థాంతరంగా ప్రదర్శనను ఆపేయమంటే ఎలా? నాకెంత నష్టం వస్తుందో తెలుసా?" అన్నాడు.

"రేపటి పౌరులు కాబోయే ఎంతమంది పసిహృదయాలు కలుషితం అవుతాయో తెలుసా?" అని ఆ స్థూలకాయురాలు అంటే, మరో వనిత "మీకిదే హెచ్చరిక! వారం రోజుల్లోగానే ఆ సినిమాను మీ థియేటర్‌లోంచి తీసెయ్యాలి. మాట తప్పారో, మీ థియేటర్‌కు నిప్పంటిస్తాం. కిటికీ అద్దాలు విరగ్గొట్తాం. తెర చించేస్తాం" అంది.

"అలాగే తల్లుల్లారా!" అని ధర్మరాజు లెంపలు వేసుకుంటూ, "ఇక దయచేసి త్వరగా వెళ్లిపోండి. జనం క్రిక్కిరిసిపోతున్నారు. పోలీసులొస్తే తంటా" అని దాదాపు వేడుకున్నాడు.

"కేరళనారి" చిత్రాన్ని రోజుకు అయిదారు ఆటల చొప్పున ప్రదర్శింపచేశాడు ధర్మరాజు. ఒకరోజు ఏడో ఆట కూడా వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆ వారమంతా ధర్మరాజు నాతో మాట్లాడ్డానికే వీలులేకపోయింది.

ఆ చిత్రం ఆఖరిరోజు చివరి ప్రదర్శన చూసి థియేటర్‌లోంచి బయటకొస్తున్న ఓ బట్టతల మనిషిని "ఎలా ఉంది సినిమా?" అని అడిగాను. అంతే.... అతగాడు నా వంక చురచుర చూస్తూ వెళ్ళిపోయాడు... నాకేం పాలు పోలేదు. ధర్మరాజు గదిలోకి వెళ్లాను. అతని టేబుల్ ముందు ఆ నలుగురు మహిళలు ఉన్నారు. వాళ్ళకు తలా ఒక నూలు చీర, కవర్‌లో కొంత డబ్బు ఇస్తూ, "కేరళనారి" - తుక్కు సినిమాకు మొదటి రెండు రోజులూ థియేటర్ ఖాళీ. నాలుగైదు మళయాల సినిమాలలోంచి తీసిన అతుకుల బొంత సినిమాలో ఏముంది - నా బొంద! 'అసభ్య సినిమా ప్రతిఘటన' పేరున మీరు చేసిన ప్రచారం మంచి ఊపు ఇచ్చింది. నాకు బాగా లాభం వచ్చింది," అని విరగబడి నవ్వాడు. ఆ నవ్వుతో ఆ నలుగురు మహిళలూ శ్రుతి కలిపారు.

నేను ఏడవలేక నవ్వాను - ఆ మహిళలు ఆ థియేటర్‌లో చెత్త ఊడ్చే పని వాళ్ళని తెలిసినప్పుడు. ❁